ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కడప

జిల్లా వార్తలు

శనివారం 6 జూలై 2024



టోల్‌గేట్ తొలగించడంతో డివైడర్ లేకుండా ఎక్కువ వెడల్పుగా ఉన్న రోడ్డు

పాత టోల్‌గేటు వద్ద ప్రాణాలు పోతున్నాయ్..!

వెలుగు జిలుగులతో విరాజిల్లిన హైవే టోల్‌గేట్ ప్రాంతం.. నేడు ఒక్కసారిగా చీకట్లోకి వెళ్లింది. ఫలితంగా నిత్యం వేలాది వాహనాల రాకపోకలు జరిగే హైవే మృత్యు రహదారిగా మారింది. ఒక్క నెలలోనే నాలుగు ప్రమాదాలు జరిగి ముగ్గురు చనిపోగా ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. టోల్‌గేట్ ఏర్పాటు చేసే ముందు.. ఏర్పాటు చేసిన తర్వాత టోల్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజల అవసరాలపై లేదని దాదాపు ఆరేడేళ్లుగా విమర్శలు రేకెత్తాయి. అయినా టోల్‌గేటు యాజమాన్యం కానీ, హైవే అధికారులు కానీ అవేమీ పట్టించుకోలేదు. వారి పని వారిదే. టోల్‌గేటు ఉన్నన్నాళ్లు వసూళ్లు చేసుకున్నారు. టోల్‌గేటు ఎత్తివేశాక అక్కడ చేపట్టవలసిన కనీస జాగ్రత్తలు కూడా చేపట్టకుండా వెళ్లారు. ఫలితంగా ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. చీకటి పడితే అక్కడికి వెళ్లాలన్నా వళ్లు జలదరించే పరిస్థితి ఏర్పడింది. డివైడరు ఏర్పాటు చేసి లైట్లు వేయండి.. ప్రమాదాలు అరికట్టండి అని ఎంత మొత్తుకుంటున్నా టోల్‌గేట్ నిర్వాహకులు, అధికారుల స్పందించడం లేదు.



- చీకట్లో అక్కడికి వెళితే గుండె గుభేల్
- ఒక్క నెలలోనే నాలుగు ప్రమాదాలు
- ముగ్గురు మృతి.. ఆరుగురికి గాయాలు
- అయినా స్పందించని హైవే అధికారులు



లైట్లు లేకపోవడంతో భయం గొలిపేలా ఉన్న పాత టోల్‌గేటు ప్రాంతం

చెన్నూరు, జూలై 5: చెన్నూరు మండల పరిధిలోని జాతీయ రహదారిలో ఉన్న పాత టోల్‌గేటు ప్రాంతం నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. పాత టోల్‌గేటు తొలగించకముందు ఈ ప్రాంతం రేయింబవళ్లు వేలాది వాహనాలు తిరుగుతూ సందడిగా ఉండేది. ఎన్ని వాహనాలు వచ్చి పోయినా భారీ లైట్లు ఉండటంతో ఇక్కడ పెద్దగా ప్రమాదాలు జరిగేవి కావు. టోల్‌గేటు ఉండటంతో వాహనాలు ఇక్కడ తప్పనిసరిగా వేగం తగ్గేవి. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఇక్కడున్న టోల్‌గేటు తీసేయడం, లైట్లు తొలగించడంతో ఈ ప్రాంతమంతా అంధకారంగా మారింది. దీనికి తోడు ఇక్కడ రోడ్డుపక్కన ఒక హోటల్ వెలసింది. అక్కడికి టీ తాగేందుకు, హోటల్‌లో టిఫిన్ తినేందుకు వెళ్లినా, వెళ్లి వచ్చే సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో పాత టోల్‌గేట్ ప్రాంతం అంటేనే గుండె గుభేల్ అనే పరిస్థితి ఏర్పడి ప్రజలు కంపించిపోతున్నారు.

నెలలోపే నాలుగు ప్రమాదాలు

పాత టోల్‌గేటు తొలగించిన తరువాత ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ టోల్‌గేటు తొలగించిన ప్రాంతం 12లేన్ల రోడ్డుగా ఉండటంతో అక్కడికి వచ్చేసరికి వాహన చోదకులు విపరీతమైన వేగంతో వెళుతుంటారు. దీంతో ఈ పాత టోల్‌గేటు ప్రాంతం దాటిన తరువాత కడప వైపు పలు ప్రమాదాలు జరిగాయి. ఎందుకంటే ఈ పాతటోల్‌గేటు వద్దకు వచ్చేసరికి పెంచిన వేగం నియంత్రించలేకపోవడం, కాసింత ముందు నాలుగురోడ్ల సర్కిల్ (ఇర్కాన్) ఉండడం.. దీంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోవడం, క్షతగాత్రులై మంచాన పడడం మామూలైంది. పాత టోల్‌గేటు వద్ద నెల కిందట జరిగిన ప్రమాదంలో బద్వేలుకు చెందిన ఓ మహిళ, ఆమె మరిది కొడుకు ప్రాణాలు కోల్పోగా ఆమె కొడుకు క్షతగాత్రుడయ్యాడు. వారం కిందట జరిగిన ప్రమాదంలో ఎర్రగుంట్లకు చెందిన ఓ లారీ డ్రైవరు ప్రాణాలు కోల్పోయాడు. ఆ తరువాత మరో ప్రమాదం జరిగినా అది బయటికి పొక్కలేదు. ప్రమాద స్థాయి తీవ్రంగానే ఉందని స్థానికులు చెబుతున్నారు. నాలుగురోజుల కిందట ఇదే ప్రాంతంలో చెన్నూరు నుంచి కడప వైపు వెళుతున్న ఆటోను లారీ ఢీకొనడంతో ముగ్గురు మహిళలు చిన్నారులు గాయాలపాలయ్యారు. వారిలో ఇద్దరు చిన్నారుల పరిస్థితి ఆందోళనగా మారింది. ఇలాంటి ప్రమాదాలు మున్ముందు ఇంకెన్ని జరుగుతాయోనని ప్రజలు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

లైట్లు లేవు.. డివైడర్లు లేవు..

ఎంతో వెడల్పుగా ఉన్న ఈ పాత టోల్‌గేటు ప్రాంతంలో డివైడరు వేసి కనీసం ఓ పదిలైట్లు అయినా ఏర్పాటు చేస్తే రాత్రి సమయాల్లో ఇక్కడ ప్రమాదాలను అరికట్టవచ్చు. అయినా అధికారుల్లో గానీ, టోల్‌గేట్ నిర్వాహకుల్లో గానీ చలనం లేదు. ఎవరు చస్తే మాకేం.. ఎవరు ఏమైతే మాకేం.. మేం చూస్తూనే ఉంటాం అనే ధోరణిలో ఉన్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వాహనాల చెకింగ్ అధికారి మృతి

గత ఏడాది ఓ రోజు అర్ధరాత్రి దాటాక.. పాత టోల్‌గేట్ దాటగానే వచ్చే ఇర్కాన్ సర్కిల్ వద్ద రోడ్డుకు పూర్తిగా పక్కగా నిలిచి ఓ మోటార్ వెహికల్ అధికారి వాహనాలను చెకింగ్ చేస్తుండగా.. ఓలారీ మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొనడంతో ఆ అధికారితో పాటు, ఆయన కారు డ్రైవరు కూడా చనిపోయారు. దీనికి కారణం పాతటోల్‌గేటు వద్ద రోడ్డు వెడల్పుగా ఉండటంతో వాహనం వేగంగా రావడమే. ఆలాంటి సంఘటనలు ఇక్కడ తరచూ జరుగుతూనే ఉన్నాయి. నిద్రమత్తులో లారీని నడిపితే ఇతరుల ప్రాణాలకు ప్రమాదమని.. ఇక్కడ టీ తాగేందుకు వెళ్లి తిరిగి వస్తున్న ఓ డ్రైవరును కారు ఢీకొంది. దీంతో ఆ డ్రైవరు మృతిచెందడంతో వారి కుటుంబం వీధినపడింది. హైవే కాబట్టి వాహనాల వేగం తక్కువేమీ ఉండదు. పాత టోల్‌గేట్ వద్దకు వచ్చేప్పటికి రోడ్డు వెడల్పు చూస్తే వాహనదారులు వేగం మరింత పెంచుతున్నారు. ఇటీవల ఇక్కడ హోటళ్లు రావడంతో వాటిని చూడగానే నిలిపేందుకు ఒక్కసారిగే బ్రేకులు వేయడంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.

పాత చరిత్రా ప్రమాదాల మయమే

టోల్‌గేటు ఏర్పాటు చేయకముందు కూడా ఈ ప్రాంతం ప్రమాదాలమయంగా ఉండేది. ఇదే చోట లెక్కకు మించి ప్రమాదాలు జరిగాయి. ఎందరో మృత్యువాత పడ్డారు. మరెందరో క్షతగాత్రులుగా మారారు. రామకుప్పం వాసుల బస్సు తీవ్ర ప్రమాదానికి గురై 15 మందికి పైగా ఇక్కడ చనిపోయారు. అలాగే ఆళ్లగడ్డకు చెందిన వాహనం కూడా అప్పట్లో ప్రమాదానికి గురై పలువురు చనిపోయారు. అప్పట్లో ఇన్ని ప్రమాదాలు జరగడానికి కారణం ఇది సింగిల్‌రోడ్డు కావడం. చెన్నూరు వైపు వచ్చే సమయంలో ఇర్కాన్ సర్కిల్ దాటగానే కల్వర్టు ఉంది. ఇది వెడల్పు తక్కువగా ఉండటంతో గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగేవి. ఇక్కడ టోల్‌గేటు ఏర్పాటు చేసి.. ఏడాది క్రితం దానిని వేరేచోటుకు మార్చడంతో ఇక్కడ రోడ్డు వెడల్పు ఎక్కువగా మారి ఇప్పుడు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చీకటి పడ్డ తరువాత అక్కడికి వెళితే యముడే మనను వెంటాడతాడనే ప్రచారం జనంలో సాగుతోంది.

చీకట్లో వెళుతుంటే భయం వేస్తోంది..



కడప నగరంలో చేపల వ్యాపారం చేస్తున్నా. రోజూ చీకట్లో వెళుతుంటా. వేకువనే 4గంటల సమయం కాబట్టి అక్కడకు వెళ్లగానే భయం వేస్తుంది. టోల్‌గేటు ప్రాంతం వెడల్పుగా ఉండటంతో ఏ వైపు ప్రమాదం ముంచుకు వస్తుందో అర్థంకాదు. ఇప్పటికి అయితే బాగున్నాం. ముందు ముందు చెప్పలేం. అధికారులు లైట్లు వేయకుంటే ప్రమాదమే.

- మల్లె చిన్నసుబ్బయ్య, బెస్తకాలనీ, చెన్నూరు

అక్కడికి రాగానే గుండెల్లో దడ..



పాత టోల్‌గేటు వద్ద డివైడర్ కట్టరు. లైట్లు వేయరు. నగరంలో వ్యాపారం చూసుకుని రాత్రి 8గంటలకు రోజూ ఇంటికి వెళతా. ఇక్కడికి వచ్చేసరికి మాత్రం భయంకరమైన చీకటి. రోడ్డుకు అటు వైపు ఇటు వైపు రెండు వరుసల్లో వాహనాలు నిలిపి ఉంచుతారు. డివైడర్లు లేకపోవడం, చీకటిగా ఉండటంతో వాహనాలు అత్యంత వేగంగా అడ్డదిడ్డంగా వెళుతుంటాయి. ఆ సమయంలో వాహనాల వేగం చూస్తే గుండెల్లో దడ పుడుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- ఎం.రామసుబ్బయ్య, చిన్నమాచుపల్లె, చెన్నూరు మండలం

హైవే అధికారులు ఏర్పాట్లు చేయాల్సిందే..



గతంలో ఉన్న టోల్‌గేటును ఖాజీపేట మండలానికి మార్చడంతో అక్కడ పూర్తిగా ఖాళీ అయి చివరికి లైట్లు డివైడర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. పాత టోల్‌గేటు ప్రాంతాన్ని పరిశీలిస్తా. అక్కడి సమస్యలు స్వయంగా చూస్తా. ఇప్పటికే ప్రమాదాలు జరిగి ఇటీవల ప్రాణాలు కోల్పోయారన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఇకపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పూర్తి చేయిస్తా. వెంటనే హైవే అధికారులు డివైడరు, లైట్లు ఏర్పాటు చేయకపోతే వారిపై చర్యలు తప్పవు.

- పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్యే, కమలాపురం

కడప-అన్నమయ్య జిల్లాలను కలుపుతూ ఉన్న గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదాలను తగ్గించడంతో పాటు.. మెరుగైన రవాణా సౌకర్యం కోసం.. కేంద్ర ప్రభుత్వం సొరంగ మార్గం (టన్నెల్) తవ్వడానికి పచ్చజెండా ఊపింది. 2.5 కిలోమీటర్ల సొరంగ నిర్మాణం కోసం రూ.వేయికోట్ల నిధులను విడుదల చేసింది. దీనిపై ఈప్రాంత వాహనదారులు, ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో సొరంగ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

- రూ.వెయ్యి కోట్లు విడుదల చేసిన కేంద్రం
- త్వరలోనే పనుల ప్రారంభం
- తీరనున్న వాహనదారుల కష్టాలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని కడప-రాయచోటి మార్గంలో రామాపురం మండల పరిధిలో గువ్వలచెరువు వద్ద ఈ ఘాట్ ఉంది. ఈ ఘాట్ సుమారు 6 కిలో మీటర్ల మేర ఉంటుంది. ఈ ఘాట్‌లో పదికి పైగా మలుపులు ఉండగా.. అందులో కొన్ని ప్రమాద కరంగా ఉంటాయి. దీంతో ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సగటున ప్రతి రోజూ ఈ ఘాట్‌లో ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతోంది. దీంతో పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. గాయపడ్డ వాళ్ల సంఖ్య పెద్ద సంఖ్యలోనే ఉంది. అదే విధంగా ఈ ఘాట్‌లో ప్రయాణం కూడా వాహనదారులకు చాలా కష్టతరంగా ఉంది. దీంతో ఈ ఘాట్‌లో సొరంగం తవ్వాలనే డిమాండు ఒకటన్నర దశాబ్ద కాలంగా ఉంది. సొరంగ మార్గం నిర్మాణం చేయడం వల్ల ప్రమాదాలు తగ్గడంతో పాటు.. వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

కర్నూలు-చిత్తూరు జాతీయరహదారి కావడంతో ఇదే మార్గం గుండా తమిళ నాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణాతో పాటు పలు రాష్ట్రాలకు లారీలు, రవాణా వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. కడప, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, నంద్యాలతో పాటు మరికొన్ని జిల్లాలకు ఈ మార్గం నుంచే వాహనాలు వెళ్తాయి. దీంతో రోజూ ఈ మార్గంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ఇక్కడ సొరంగ మార్గం ఏర్పాటు చేయడం ద్వారా.. ప్రజలకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుంది. ఈ సొరంగ మార్గాన్ని కడప రోడ్డులోని సుగాలి బిడికి నుంచి ఘాట్ చివరి మలుపు వరకు నిర్మించనున్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో సొరంగమార్గం నిర్మాణానికి 2022లో సర్వే జరిగింది. సర్వే ప్రకారం 6 కిలోమీటర్ల రోడ్డులో ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించనున్నారు. 2.5 కిలో మీటర్లు సొరంగం తవ్వనున్నారు. 2023లో టెండర్లను కూడా పిలిచారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ సొరంగ మార్గం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

నేడు బాధ్యతలు చేపట్టనున్న కొత్త కలెక్టర్



లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 5: జిల్లా నూతన కలెక్టర్‌గా లోతేటి శివశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా అధికారిక సమాచారం మేరకు శనివారం ఉదయం 10-45 గంటలకు కలెక్టర్ చాంబర్‌లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

- మినిస్టరు కాలనీలో రెవెన్యూ భూమి ఆక్రమణ
- రామరాజుపల్లె వద్ద వంకలో లే అవుట్
- వైసీపీ ఆక్రమించిన ప్రభుత్వ భూములను కాపాడుతాం
- ఎమ్మెల్యే ఆర్.మాధవి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, వైసీపీ నాయకులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యత టీడీపీదే అని ఎమ్మెల్యే ఆర్.మాధవి అన్నారు. మినిస్టరు కాలనీలో రెవెన్యూ భూములు ఆక్రమించారని, రామరాజుపల్లెలో వంక స్థలంలో వైసీపీ నాయకులు లేఅవుట్లు వేసి ఆక్రమించారని అన్నారు. శుక్రవారం కడప నగరం ద్వారకనగర్‌లోని తమ నివాసంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ల్యాండ్‌టైటలింగ్ యాక్టు తీసుకువచ్చి ప్రభుత్వ ప్రైవేటు భూములను కబ్జా చేశారని అన్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురై టీడీపీ కూటమికి 164 సీట్లు కట్టబెట్టారన్నారు. 2019లో జగన్ ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచామని చెప్పి 2024లో ఓడిపోయిన తరువాత ఈవీయంలు ట్యాంపరింగ్ జరిగాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 20 రోజులు కాకముందే హామీలు అమలు చేయడంలేదని గగ్గోలు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇలాగే విమర్శిస్తే 2029లో వైసీపీకి ఒక్క సీటు మాత్రమే వస్తుందన్నారు.

కార్పొరేషన్ జనరల్ బాడీ మీటంగులో శ్మశాన వాటిక, పాఠశాల ఆక్రమణ, జడ్పీ, పోలీసు స్థలాల ఆక్రమణపై చర్చించామని అన్నారు. ఆక్రమించిన వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. మినిస్టరు కాలనీ పేరుతో ప్రభుత్వ భూమి కబ్జా చేశారని దీనిని స్వాధీనం చేసుకుంటూ రెవెన్యూ అధికారులు బోర్డులు నాటారన్నారు. రామాంజనేయపురంలో వంకపోరంబోకు భూమిని కాపాడామన్నారు. గంజాయి కేసులు పట్టుబడితే రౌడీషీట్ ఓపెన్ చేయమని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. ఉచిత పథకాల కోసం జగన్ అధిక పన్నులు వేశారని వారి కార్పొరేటర్లే జనరల్ బాడీ మీటింగ్‌లో వాపోతున్నారని గుర్తు చేశారు. ఈ కార్పొరేటర్లు జగన్‌ను ఎందుకు ప్రశ్నించలేక పోయారని అడిగారు. కొత్త డ్రామా ఆడవద్దని హితవు పలికారు. మహిళలపై దాడి చేయడం, అమ్మాయిలను ఎత్తుకుని పోతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎవరైనా చట్టానికి లోబడి ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక శక్తులను కాపాడేందుకు ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యేలు మంత్రులు లేరని గుర్తు చేశారు.

పౌరసరఫరాల శాఖలో అనధికార ఘనుడు



FPS Details for 1150259181

District | Office | Status
Kadapa | Proddutur | Active
Dealer | Nominee | Device Id
T S AFROZ SHG | -NA- | 1150259181

MDU Details

MDU Id | MDU Name | Mobile No
KP82006 | Shaik Abdul Gaffar | 9849090728

Dealer/Nominee Logins

Sl No | Total Logged In Days | Today First login
1 | 3 | Not Login Today

Authentications

Success | Failure | Total
776 | 161 |

Transaction Details

ఏఈపీడీఎస్ సైట్‌లో అనధికారికంగా డీలర్ల పేరు మార్పు చేసిన దృశ్యం

- డీఎస్‌ఓ సైట్ పాస్‌వర్డ్‌ను వినియోగం
- డీఎస్‌ఓ నుంచి ఆదేశాలు రాకనే సైట్‌లో మార్పులు
- రేషన్ కార్డుల అలాట్‌మెంట్‌లు సైతం మార్చిన వైనం

ప్రొద్దుటూరు, జూలై 5: ప్రొద్దుటూరు రెవెన్యూ కార్యాలయం పరిధిలోని పౌరసరఫరాల విభాగంలో ఒక అనధికార ఉద్యోగి కొన్నేళ్లుగా అన్నీ తానై చక్రం తిప్పుతున్నాడు. ఇతనితో అవినీతి బంధం కారణంగా అనేక అవినీతి ఆరోపణలున్నా సివిల్ సప్లయ్ అధికారులు ఇతడిని దూరం చేసుకోలేకపోతున్నారు. డీలర్లతో మంచి సంబంధాలున్న ఈ అనధికార ఉద్యోగి ఎవరైనా విజిలెన్స్ అధికారులు గానీ సివిల్ సప్లయ్ అధికారులు గానీ తనిఖీలకు వస్తున్నారంటే.. వారికి ముందుగా సమాచారమిచ్చి అలర్ట్ చేసి సరుకు దొరకకుండా కాపాడతారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా గతంలో పనిచేసిన తహశీల్దారు ఇతనిద్వారా భారీగా డబ్బు ముట్టజెప్పిన డీలర్లకు రేషన్ కార్డుల అలాట్‌మెంట్ పెంచేవారు. దీంతో చాలామంది డీలర్లు నష్టపోయారు. కార్డులు అధికంగా అలాట్‌మెంట్ చేయాలంటే ముందుగా ఈయనకు భారీగా సమర్పించుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రతి డీలరు ఇతనికి నెల మామూళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

సివిల్ సప్లయ్ కార్యాలయంలో ప్రత్యేకంగా జూనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో ఇతనే కంప్యూటర్ ఆపరేటింగ్ చేస్తుంటాడు. దీంతో మొత్తం సివిల్ సప్లయ్ అధికారుల పాస్‌వర్డులతో సహా వినియోగిస్తున్నాడు. ప్రభుత్వం మారడంతో వారం కిందట శ్రీనివాసనగర్‌లోని 33 షాపు డీలరు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఆమె రాజీనామా చేసిన వెంటనే ఏఈపీడీఎస్ సైట్‌లో కొత్త డీలర్ పేరు మార్చారు. అంతేకాకుండా ఎండీయూ ఆపరేటర్ పేరును సైతం మార్చారు. ఇదంతా ఈ అనధికార ఉద్యోగి మామూళ్లు తీసుకుని వేగవంతంగా పనికానిచ్చాడు. వాస్తవానికి రాజీనామా చేసిన డీలరు వివరాలు, మార్పుచేసిన వారి వివరాల ఫైల్ ఇంకా కడపలోని డీఎస్‌ఓ కార్యాలయానికి వెళ్లక ముందే, అధికారుల ఆదేశాలు రానిదే ఈ ఘనుడు సైట్‌లో పేర్లు మార్చాడంటే ఎంత ఘనాపాటి అయ్యుండాలో ఆశ్చర్యం వేయక మానదు. తన జేబులు నింపితే చాలు పౌరసరఫరాల శాఖలో అతను ఏ అధికారి ఆదేశాలు లేకుండానే పనిచేయగల సమర్థుడు. ఇతనిపై కొత్త ప్రభుత్వంలో అయినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కొందరు డీలర్లు డిమాండ్ చేస్తున్నారు.

జగనన్న లేఅవుట్‌పై విచారణ

- ఆదేశించిన సీఎం చంద్రబాబు
- అక్రమాలు జరిగాయని ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

పులివెందుల, జూలై 5: పులివెందుల జగనన్న హౌసింగ్ కాలనీలో అక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచారణకు ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం ఆదేశాలు వెలువడ్డాయి. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పులివెందుల జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అక్రమాలపై విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 'అక్రమార్కులకు పుట్టినిల్లు జగనన్న కాలనీ' పేరుతో ఈనెల 1వ తేదీన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. జగనన్న కాలనీలో అనర్హులకు పెద్దపీట వేసి స్థానికులు కాకపోయినా ఇంటి స్థలం, పక్కాగృహం మంజూరు చేశారు. అలాగే చోటామోటా నాయకుల ఆశీస్సులు ఉన్న వారికి ప్రధానరోడ్డుకు ఇరువైపుల ఇళ్లు ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. మొదట ఒకసారి లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులకు వరుస ప్రకారం ప్లాట్లను వేసి ఉంచారు. కానీ వారి అనుచరులకు, వారు చెప్పిన వారికి మారుమూల వచ్చాయని మరోమారు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి అర్హులు కానివారికి అగ్రపీఠం వేశారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులందరు పక్కా గృహం నిర్మాణానికి రూ.35వేలు కట్టాలని నాటి అధికారులు ఆదేశించారు. అది కూడా వలంటీర్లను ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వసూలు చేసేలా ఒత్తిడి తెచ్చారు. దాదాపు 8,400 పక్కాగృహాలకు గాను నాలుగు వేల మంది రూ.35వేల చొప్పున మున్సిపాలిటీకి చెల్లించారు. మిగిలిన వారు డబ్బు చెల్లించకపోయినా వారిపై ఒత్తిడి తేక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

అనర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం, పక్కా గృహం నిర్మాణానికి రూ.35వేలు వసూలు చేయడం, ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉండటం తదితర అక్రమాలపై సీఎం విచారణకు ఆదేశించారు. ఇక్కడ జరిగిన అక్రమాలు విచారణలో మరిన్ని వెలుగుచూసే అవకాశం ఉంది.

ఎంపీ ఆందోళన చేస్తానడం హాస్యాస్పదం

- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



పులివెందుల, జూలై 5: ఉద్యోగులను తొలగిస్తే ఆందోళన చేస్తానని ఎంపీ అవినాశ్‌రెడ్డి అనడం హాస్యాస్పదమని.. ఇది దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందుల మార్కెట్ యార్డులోని ఉద్యోగుల విషయంలో వచ్చిన వార్తల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ ఓ వీడియో విడుదల చేశారు.

2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఆ పార్టీ నాయకులు చెప్పారన్నారు. అప్పట్లో ఉద్యోగులు కాస్త వ్యవధి ఇవ్వండి ఆలోపు ఏదొక ఉపాధి చూసుకొని వెళ్తామని చెప్పినా వారిని ఉన్నపలంగా తొలగించారన్నారు. ప్రస్తుతం టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తిరిగి ఆ ఉద్యోగాలు తమకు ఇప్పించాలని అప్పటి సిబ్బంది కోరడంతో తమ నాయకులు అక్కడకు వెళ్లి సాధ్యాసాధ్యాల గురించి ప్రయత్నిస్తున్నారన్నారు. అలాగే వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రిపుల్‌ఐటీలో, గండి దేవస్థానంలో, జేఎన్టీయూ, కస్తూరిబా పాఠశాలలు, బీసీ హాస్టళ్లలో అనేక మందిని ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. ఇవన్నీ మరిచిపోయి ఉద్యోగాల నుంచి తొలగిస్తే ధర్నా చేస్తానని ఎంపీ అవినాశ్‌రెడ్డి హాస్యాస్పదంగా ఉందన్నారు. అలా అయితే.. గతంలో మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తొలగించిన వందలాది మంది వచ్చి మీ ఇంటి ముందు ధర్నా చేయాల్సి వస్తుందన్నారు. అధికారులను బెదిరించడం కరెక్ట్ కాదన్నారు. అలాగే అధికారులు ఏ రాజకీయ నాయకులకు భయపడాల్సిన అవసరం లేదని నిబంధనల ప్రకారం నడచుకునే వారికి తాను అండగా ఉంటానని బీటెక్ రవి భరోసా ఇచ్చారు.



పవన్‌ను కలిసిన జనసేన నేత సుంకర

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5: మంగళగిరి సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను జనసేన పార్టీ జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పవన్‌కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

2,516 మంది సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, జూలై 5: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం ప్రత్యేక కేటగిరిల్లో 2,516 మంది విద్యార్థులకు నూజివీడు ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయినట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. ఎన్‌సీసీ కేటగిరిలో మొదటి ఐదురోజులకు 1141 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 162 మంది, క్యాప్ విభాగంలో 167, దివ్యాంగుల విభాగంలో 249, క్రీడా విభాగంలో 796 మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారన్నారు. జనరల్ కౌన్సెలింగ్‌కు సంబంధించి క్యాంపస్‌ల వారీ ఎంపికైన విద్యార్థుల తుది జాబితా ఈ నెల 11న విడుదల చేస్తామని, ఎంపికైన విద్యార్థులు ధ్రువ పత్రాల పరిశీలన, నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో జూలై 22, 23 తేదీల్లో నూ, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి ఆర్కే వ్యాలీలో 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌లో 26, 27 తేదీల్లో జరుగుతుందన్నారు.

పోలీసుగేమ్స్‌లో ఆర్ఎస్ఐ కల్పన ప్రతిభ

పతకాలు అందించిన డీజీపీ


డీజీపీ నుంచి పతకాలు అందుకున్న కల్పన

పోరుమామిళ్ల, జూలై 5: పోలీసు గేమ్స్‌లో పోరుమామిళ్ల వాసి, ఆర్ఎస్ఐ కల్పన డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి పతకాలు అందుకుంది. ఇటీవల అస్సాం రాష్ట్రం గౌహతీ నగరంలో జరిగిన 9వ ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్స్‌లో ఏపీ పోలీసు డిపార్ట్‌మెంట్ తరపున కర్నూలు జిల్లాలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న కల్పన తైక్వాండో, కరాటే, సెన్‌కార్డ్, శిలాగ్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించింది. పోరుమామిళ్ల వాసి ప్రస్తుతం ప్రొద్దుటూరు ట్రాఫిక్ స్టేషన్‌లో పనిచేస్తున్న బాషా టీం కోచ్‌గా వ్యవహరించడం, రెండు పతకాలు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. కల్పన ద్వారక తిరుమలరావు నుంచి పతకాలు అందుకున్నందుకు పోరుమామిళ్ల ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన బాధ్యత

డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు


అరుంధతీనగర్‌లో ఆరోగ్యం పై సూచనలు ఇస్తున్న డీఎం హెచ్ఓ డాక్టర్ నాగరాజు

చెన్నూరు, జూలై 5: వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, స్వచ్ఛమైన నీరు, కలుషితం లేని ఆహారం ఇలాంటివన్నీ వ్యక్తిగతమేనని ఎవరి ఆరోగ్యం వారిదేనని ఏ ఒక్కరూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా జీవించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు అన్నారు. చెన్నూరు అరుంధతీవాడలో ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. మురుగు కాల్వలు ఎక్కువగా ఉండడం, అందులో నీరు నిలిచి దోమలు పెరిగి వాటి విజృంభణ ఎక్కువ కావడం చూశారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో మలేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. డెంగ్యూ తీవ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా ఉప మలేరియా అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. నీరు కలుషితం కాకుండా కాచి వడగట్టి తాగాలన్నారు. చిన్నపాటి సమస్యలున్నా సమీప వైద్యశాలను సంప్రదించాలని, రెండు,మూడురోజులు విడవని జ్వరం ఉంటే రక్తపరీక్షలు తప్పనిసరన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, జిల్లా మలేరియా వైద్యాధికారి మునెమ్మ పాల్గొన్నారు.

బయనపల్లె ఆంజనేయుడి ఆలయంలో చోరీ

పసుపు దుస్తుల్లో వచ్చి పట్టపగలు చోరీ చేసిన వైనం

బద్వేలు రూరల్, జూలై 5: బయనపల్లె రామభక్త ఆంజనేయస్వామి ఆలయంలో పసుపు దుస్తులు ధరించి పట్టపగలే చోరీకి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఆలయ నిర్వాహకులు రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు గురువారం 11.30గంటలకు పూజారి ఇంటికి వెళ్లిన తర్వాత ఓ వాహనంలో ఏడుగురు వచ్చారని తాము మఠం నుంచి తిరుమల వెళుతున్నామని కాసేపు ఇక్కడ సేద దీరుతామని ఆలయం ముందు ఉన్న దుకాణ యజమానికి తెలిపి ఆలయంలోకి వెళ్లారన్నారు. ఓ ఇద్దరు దుకాణం వద్ద మాట్లాడుతుండగా లోపలికి వెళ్లిన ఐదుగురు ఆలయంలోని స్వామివారి వెండి కిరీటం, వెండి కళ్లు, వెండి పాదాలు, గద స్వామివారి అభయహస్తాలు, సీతమ్మవారి బంగారు తాళిబొట్టు సరుడు చోరీ చేసుకుని వెళ్లారని తెలిపారు ఆలయ పూజారి వచ్చి చూసే వరకు చోరీ జరిగినట్లు గుర్తించలేక పోయామన్నారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రేషన్ వాహనాలపై ఇంకా మారని జగన్ స్టిక్కర్లు



గోపవరం, జూలై 5: గత నెల 4న ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అదే నెల 12న ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు చంద్రబాబు పాలన సాగుతోంది. అయినా మండలంలో ఇంకా వైసీపీ వాసనలే ఉన్నాయి. రేషన్ వాహనాలపై ఇప్పటికీ మాజీ సీఎం జగన్ ఫొటోలనే కొనసాగిస్తూ వాటితోనే రేషన్ పంపిణీ చేయడం చూసి జనం ఔరా.. ఇప్పుడు ఇంతకీ సీఎం చంద్రబాబా, లేక జగనా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యలు చేపట్టి దాదాపు 21 రోజులు కావస్తున్నా ఇంకా తొలగించకుండా రేషన్ వాహనాలపై జగన్ ఫొటో చూసి నాలుగురోజుల కిందట మాజీ ఎమ్మెల్యే విజయమ్మ టీడీపీ కార్యకర్తలపై మీరేం చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. అయినా లోకల్ నాయకులు పట్టించుకోకుండా ఉన్నారు.

రేషన్ బండ్లను తహసీల్దారు కార్యాలయానికి తీసుకురావాలసిందిగా తహసీల్దారు రోశన్న ఆదేశించారు. ఈ బండ్లను సబ్సిడీతో ఇవ్వడం ద్వారా అదే సొంత బండ్లు అన్నట్లుగా వైసీపీ నేతలు ఫీల్ అయిపోతున్నారు. అయితే సాక్షాత్తు తహసీల్దారే ఫొటోలు తీసేయాలని చెప్పినా మేమింతే అన్నట్లుగా వారు వ్యవహరించడం గమనార్హం.

డ్రైనేజీ వివాదంపై ఇద్దరి మహిళలపై దాడి

రాజంపేట టౌన్, జూలై 5: నందలూరు పోలీసుస్టేషన్ సమీపంలోని టీడీపీకి చెందిన సుహాసిని, కాంతమ్మపై వైసీపీ నేతలు బాబు, సుజాత, సుబ్బరాయుడు మరికొందరు దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు మాట్లాడుతూ రెండు రోజుల కిందట డ్రైనేజీ విషయంపై ఘర్షణ జరిగిందన్నారు. ఈ విషయం వారు మనుసులో పెట్టుకుని వారి బంధువులను పిలిపించుకుని తమపై దాడి చేసినట్లు వారు తెలిపారు. టీడీపీ సానుభూతిపరులమనే కోపంతో దాడి చేశారని, పోలీసులు తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిపై దాడి - నగదు బంగారం చోరీ


గాయపడిన యానాదయ్య

నందలూరు, జూలై 5: టంగుటూరులో వ్యక్తిపై దాడి చేసి నగదు, బంగారు చోరీ చేసిన సంఘటన ఈనెల 1వ తేదీన చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ మహ్మద్ జహీ ర్ మాట్లాడుతూ పగడాల సంతోష్ 1వ తేదీ మధ్యాహ్నం మునగ యానాదయ్య ఇంట్లోకి చొరబడి రూ.57 వేల నగదు, రెండు తులాల బంగారు చైను చోరీ చేసి వెళు తుండగా అడ్డుపడిన యానాదయ్యపై స్క్రూడ్రైవర్‌తో దాడి చేశాడు. గాయపడిన వ్యక్తి గురువారం తమకు ఫిర్యాదు చేయగా దాడిచేసిన యువకున్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందిరానగర్‌లో వైసీపీ భూ దందా

- రూ. కోట్లల్లో ప్రభుత్వ స్థలాల అమ్మకాలు
- పుట్టగొడుగుల్లా బోగస్‌పట్టాలు
- నేతలు, అధికారులు పరస్పర సహకారం
- టీడీపీ పాలనలో బయటికి వస్తున్న బాగోతం

కడప(రూరల్) జూలై 5: కడప కార్పొరేషన్‌లో విలీనమైన చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఇందిరానగర్‌లో వైసీపీ నేతల భూదందాకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. వైసీపీకి చెందిన కీలకనేతలు రెవెన్యూ అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది పరస్పర సహకారంతో రూ. కోట్లల్లో దందా సాగించారు. ఇందిరానగర్ సహా పరిసర ప్రాంతాల్లోని మామిళ్లపల్లె రెవెన్యూ పొలంలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ డీకేటీ, వివాదాస్పద భూములు మెండుగా ఉన్నాయి. సదరు స్థలాలను వైసీపీ నేతలు, అధికారులు పరస్పర సహకారంతో పథకం ప్రకారం బోగస్ పట్టాలను పుట్టించి అమ్మకాలు సాగించారు. ఒక్క ఇందిరానగర్‌లోనే వందకు పైగా ఇంటి స్థలాలను అమ్మినట్లు సమాచారం. ఇందిరానర్ ఎంట్రెన్స్‌లో ప్రభుత్వ అవసరాలకు ఉంచిన దాదాపు రూ. 3 కోట్లు విలువైన ఎకరా స్థలాన్ని కొందరు వైసీపీ నేతలు దక్కించుకుని వారి వాటా స్థలంలో ఒకటి ముక్కాల్ సెంటు ప్లాట్ రూ. 3 నుంచి 4 లక్షలకు ఆశావహులకు అమ్మి సొమ్ముచేసుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. సదరు స్థలాలు వివాదాస్పదం కావడంతో గుట్టు రచ్చకెక్కింది.

ఫారెస్ట్ బఫర్ ల్యాండ్‌లో అక్రమకట్టడాలు

ఇందిరానగర్ యానాదుల కాలనీ, స్పోర్ట్స్ స్కూల్ మధ్య రింగ్‌రోడ్డుకు దాదాపు రెండెకరాల వరకు ఫారెస్టు బఫర్ ల్యాండ్ ఉంది. ఈ స్థలం రిమ్స్‌కు అతి సమీపంలో ఉండడంతో సెంటు స్థలం రూ. 2 లక్షల పైమాటగా ఉంది. ఇలా దాదాపు రూ. 4 కోట్ల విలువైన స్థలంలో వైసీపీ కీలకనేతలు, అధికారులు కలిసి అక్రమ కట్టడాలు వేయించారు. ఒక్కో అక్రమ కట్టడం నుంచి రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఒక వేళ వీరు డిమాండ్ చేసిన మొత్తంలో డబ్బు ఇవ్వకపోతే అక్రమ కట్టడం వేశావంటూ వీఆర్ఏను పంపించి సదరు నిర్మాణాలను కూల్చివేస్తుండేవారు. దీంతో ఆశావహులు చేసేదిలేక డిమాండ్‌చేసిన మొత్తాన్ని చెల్లించక తప్పడంలేదు. ఈ తతంగం తరువాత వైసీపీ నేతలే కార్పొరేషన్ సిబ్బందిని రంగంలోకి దించి అక్రమ కట్టడాలకు ఇంటిపన్ను, కుళాయి కనెక్షన్, కరెంట్ మీటర్లను ఏర్పాటు చేయించి మరో రూ. 50వేలను అదనంగా వసూలు చేసినట్లు సమాచారం. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వీరి లీలలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి.


వైసీపీకి కట్టబెట్టిన రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం

పుట్టగొడుగుల్లా బోగస్‌పట్టాలు

ఇందిరానగర్‌లో బోగస్ ఇంటి పట్టాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నేతలతో కలిసి బోగస్ ఇంటిపట్టాల దందాను సాగిస్తున్నట్లు వినికిడి. వైసీపీ నేత మొదట తన ఆధీనంలోని ప్రభుత్వ డీకేటి స్థలాన్ని రేటు కుదుర్చుకుని ఆశావహునికి అమ్ముతాడు. ఆ తరువాత ఆశావహున్ని పలానా రెవెన్యూ అధికారి వద్దకు పొమ్మంటాడు. అక్కడికి వెళ్లగానే సదరు అధికారి తన కింద పనిచేసే సిబ్బందికి పనిని అప్పగిస్తాడు. వెనువెంటనే వైసీపీ నేత అమ్మిన డీకేటీ స్థలానికి ఎవరికీ అర్థం కాని అధికారుల సంతకాలు, రెవెన్యూ సీల్‌తో కూడిన ఇంటి పట్టా తీసుకొచ్చి ఆశావహునికి ఇస్తాడు. ఇం దుకు రూ. 30వేలను వసూలు చేస్తాడు. సమస్య వచ్చినప్పుడు సదరు ఇంటిపట్టాను పరిశీలిస్తే రెవె న్యూ రికార్డులతో సంబంధం ఉండదు. అనధికారికంగా బోగస్ పట్టాగా తేటతెల్లం అవుతుంది. ఇలాంటి బోగస్ పట్టాలు ఇందిరానర్‌లో కుప్పలు తెప్పలుగా ఆశావహుల చేతుల్లో ఉన్నాయి. ప్రస్తు తం టీడీపీ ప్రభుత్వం రావడంతో ఆశావహులకు అడ్డదారుల్లో కట్టబెట్టిన ఇంటి స్థలాలకు ముప్పుఏర్పడింది. దీంతో వైసీపీ నేతలు, అధికారులు తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోయారు.

టీడీపీ నేతలకు గాలం

వైసీపీ పాలనలో కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నేతలతో అంటకాగి ఇష్టానుసారంగా రెవెన్యూ రికార్డులతో సంబంధం లేకుండా ప్రభుత్వ స్థలాలను, భూములను ఇష్టం వచ్చినట్లు ధారాదత్తం చేశారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటి చిట్టాను బయటికి తీస్తున్నారు. దీంతో బాధ్యులైన అధికారులు తమ బాగోతం ఎక్కడ భయటపడుతుందోనని గాబరాపడుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. టీడీపీ నేతలకు లేనిపోని ఆశలు, భ్రమలు కల్పిస్తున్నారు. దీంతో కొందరు టీడీపీ నేతలు వారి మాయలో పడి వారిని కాపాడే పనిలో పడ్డారు. సదరు రెవెన్యూ అధికారులను ఆయా ఎమ్మెల్యేలు, నేతల వద్దకు తీసుకెళ్లి పరిచయం చేస్తున్నారు. దీంతో ఐదేళ్లపాటు వైసీపీతో అంటకాగి ఊడిగం చేసిన సదరు రెవెన్యూ అధికారులు టీడీపీ పాలనలో కూడా చక్రం తిప్పుతామనే భ్రమలో విహరిస్తున్నారు.

వేంపల్లెలో యువకుడిపై దాడి



అజయ్‌కుమార్‌పై దాడిచేస్తున్న దృశ్యం - గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డికి చికిత్స చేస్తున్న దృశ్యం

- బాధితుడు సతీష్ రెడ్డి అనుచరుడు
- పరామర్శించిన వైసీపీ నేతలు
- కేసు నమోదు చేసిన పోలీసులు

వేంపల్లె, జూలై 5: స్థానిక పులివెందుల రోడ్డులో పట్టపగలే వైసీపీ కార్యకర్త వేంపల్లె అజయ్‌కుమార్‌రెడ్డిపై పలువురు గుర్తుతెలియని యువకులు మూకుమ్మడిగా దాడి చేశారు. శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి ముఖ్య అనుచరుడు అజయ్‌కుమార్‌రెడ్డి బైకులో వస్తుండగా బొలెరో వాహనంతో ఢీకొట్టి హాకీ స్టిక్కులు, క్రికెట్ బ్యాట్, రాళ్లతో తీవ్రంగా దాడి చేశారు. గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డిని వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. టీడీపీ నేతలనే తిట్టేవాడివా అంటూ వారు దాడి చేశారు. ఈ ఘటనపై పది మందికి పైగా హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. సీఐ, బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పులివెందుల రోడ్డులోని ఓస్కూల్ నుంచి సాయంత్రం 4 గంటలకు అదే స్కూల్లో పనిచేస్తున్న శేఖర్‌తో కలిసి అజయ్‌కుమార్‌రెడ్డి బైకులో ఇంటికి బయలుదేరాడు. బైకు రోడ్డు మీదకు రాగానే అప్పటికే వేచి ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు బొలెరో వాహనంతో ఢీకొట్టారు. పక్కనే కాచుకున్న యువకులు హాకీస్టిక్కులు, క్రికెట్ బ్యాట్, రాళ్లతో తీవ్రంగా దాడి చేశారు. వెంట ఉన్న శేఖర్ తప్పించుకుని స్కూల్ వద్దకు పరిగెత్తాడు. పాఠశాల నుంచి ఉపాధ్యాయులు కేకలు వేసుకుంటూ రావడంతో అజయ్‌కుమార్‌ను వదిలి బొలెరోలో పరారయ్యారు. సుమారు పది మంది దాకా దాడిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ దాడి ఎందుకు జరిగిందనే విషయం పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అజయ్ కుమార్‌ను సతీష్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీను తదితరులు పరామర్శించారు. అజయ్ మాట్లాడుతూ టీడీపీకి చెందిన రవితేజారెడ్డి, అజ్జుగట్టు రఘునాథరెడ్డిని మాట్లాడేవాడివా అంటూ విచక్షణా రహితంగా దాడి చేశారని విలేకరులకు తెలిపాడు. బాధితుడి సోదరుడు మాసీధర్‌రెడ్డి వేంపల్లె పోలీస్‌సులకు చేసిన ఫిర్యాదుపై పది మందికి పైగా గుర్తుతెలియని వ్యక్తులపై హత్యాయత్నం కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వసూరులో గొంటువారిపల్లె యువకుడు దారుణ హత్య


రక్తపు మడుగులో పడిఉన్న అస్సానయ్య

కాశినాయన, జూలై5: మండలంలోని గొంటు వారిపల్లె వాసి కల్లూరి అస్సానయ్య(26)ను తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా బత్తనపల్లి స్టేషన్ పరిధిలోని వసూర్‌లో గురువారం దారుణంగా హత్యకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి కుటుంబీకుల, గ్రామస్తుల వివరాలమేరకు కల్లూరి పెద్దపీ రయ్య కుమారుడు అస్సానయ్య నాలుగు రోజుల కిందట వసూరులో కొత్తగా పీజీ ప్రారంభించాడు. తన పీజీలోని ఓగదిలో గొంతుకోసి పడేశారు. మృతిడి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో అనుమానించి బెంగుళూరులో ఉన్న కుటుంబ సభ్యులు శుక్రవారం పాజీ వద్దకు వెళ్లారు. అప్పటికే అస్సానయ్య రక్తపు మడుగులో చనిపోయి పడి ఉన్నాడు. విషయం స్థానిక పోలీసులకు తెలియపరిచి కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించా రు. మృతుడు దాదాపు రెండేళ్ల కిందట కొమరోలు వాసి వీరాంబిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వారికి 3 నెలల పాప ఉన్నట్లు సమాచారం. గ్రామంలో వలంటీరుగా పనిచేస్తున్న అస్సానయ్య ఎన్నికలకు ముందు గ్రామం వదిలి బెంగుళూరుకు పోయినట్లు సమాచారం. మృతికి గలకారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

యూ ట్యూబర్‌పై కేసు నమోదు

రైల్వేకోడూరు(రూరల్), జూలై 5: ఏవీ న్యూస్ యూట్యూబర్ దార్ల ఆనంద్‌బాబుపై రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నరసారాంపేట వాసి జంగిటి సుభద్రను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ టి.బాబు తెలిపారు. గతంలో ఇదే యూట్యూబర్‌పై సుభద్రను దాడి, లైంగిక వేధింపులు చేసిన కేసు నమోదు అయినట్లు అయిన పేర్కొన్నారు.

నేడు పులివెందులకు జగన్ రాక

పులివెందుల, జూలై 5: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పులివెందులకు రానున్నారు. తాడేపల్లె నుంచి 11గంటలకు బయలుదేరి 11.30కు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 11.40కు ప్రత్యేక విమానంలో బయలుదేరి 12.25గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 12.35గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 2గంటలకు పులివెందుల చేరుకుంటారని పీఏ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

రైలుకింద పడి వృద్ధుడు ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప (క్రైం) జూలై 5: కడప రైల్వేస్టేషన్ మూడో నెంబరు ప్లాట్‌ఫారం సమీపంలో రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి వయసు సుమారు 65 నుంచి 70 ఏళ్లుంటాయని తెలిపారు. కడప చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగుతుంటాడని, అత ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్ హాస్పిటల్ మార్చురీ గదిలో ఉంచినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన యెడల కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఎరువులు, మందుల దుకాణాల తనిఖీ


సీజ్ చేస్తున్న మందులు

మైదుకూరు, జూన్ 5: పట్టణంలోని పలు ఎరువులు, మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేసి, అమ్మకానికి నిలిపేసిన కొన్ని మందులను సీజ్ చేశారు. తిరుపతి, కడప విజిలెన్స్ అధికారులు ప్రసాద్, ఈదురుబాష స్థానిక మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్నతో కలిసి పట్టణంలోని పలు దుకాణాలను పరిశీలించారు. వివిధ దుకాణాల్లో అమ్మకాలను నిలుపుదల చేసిన మందులు దాదాపు వాటి విలువ రూ. 8700 గల వాటిని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెద్దమండ్యం, జూలై 5: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత కీర్తన(20) మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు పెద్దమండ్యం పరిధిలోని బిక్కావాండ్లపల్లి వాసి రెడ్డప్ప కుమార్తె కీర్తనకు మదనపల్లి మండలం పెంచిపాడు పంచాయతీ గొల్లపల్లికు చెందిన లక్ష్మన్నతో 8 నెలల కిందట వివాహమైంది. వారం రోజుల కిందట భార్యభర్తలిద్దరూ బిక్కావాండ్లపల్లికు వచ్చారు. ఈ నెల 3వ తేదీన కీర్తనకు తీవ్రం గా కడుపు నొప్పి రావడంతో ఇంట్లో ఉన్న బలం కోసం తెచ్చిన మాత్రలు ఎక్కువగా మింగింది. అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా రాయచోటికి తరలించారు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శుక్రవారం పెద్దమండ్యం పోలీసులకు మృతురాలి బంధువులు తెలిపారు. పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కడప ఆస్పత్రిలోనే ఉంచినట్లు, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష

రైల్వేకోడూరు(రూరల్), జూలై 5: బాలుపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ముల్లా గౌస్‌పై దాడి కేసులో నిందితుడు కాటూరి శేఖర్‌కు 18 నెలలు జైలు శిక్ష, రూ. 15 వేలు జరిమానా విధించినట్లు రైల్వేకోడూరు సీఐ టి.బాబు తెలిపారు. 2017లో కేసు నమోదైనట్లు అన్ని కోణాల్లో దర్యాప్తు పూర్తి చేసి రాజంపేట కోర్టు శిక్ష విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులపై దాడులు నిర్వహిస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

నాలుగు టిప్పర్లు పట్టివేత


పట్టుబడిన టిప్పర్లు

ఖాజీపేట, జూలై 5: అర్ధరాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. నాగసానిపల్లె సమీపంలో రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారంపై తనిఖీ చేయగా నాలుగు టిప్పర్లు పట్టుబడ్డాయి. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిరాక్స్ కేంద్రంలో చోరీ పోలీసులకు ఫిర్యాదు

కడప (క్రైం), జూలై 5: స్థానిక మునిరావు వీధిలోని జిరాక్స్ కేంద్రంలో ఉన్న జిరాక్స్, ల్యామినేషన్ మిషన్లు, కంప్యూటర్, ప్రింటర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు జిరాక్స్ సెంటర్ ప్రవీణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు షాపులోని సీసీ పుటేజీని ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

యువకుడికి తీవ్రగాయాలు

మదనపల్లె టౌన్, జూలై 5: సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్న ఇతను శుక్రవారం ఉదయం నిర్మాణ పనుల కోసం ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్రగాయాలు కాగా మదనపల్లె సర్వజన బోధనా స్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి రెఫర్ చేశారు. అవుట్‌పోస్టు పోలీసులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన సుంకర

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5: ఏపీ సచివాలయంలో శుక్రవారం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను జనసేన జిల్లా కో ఆర్డినేటరు సుంకరశ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యకుమార్‌కు దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి సత్యకుమార్‌ను సన్మానించిన సుంకర శ్రీనివాస్

రామచంద్రయ్యను కలిసిన దుర్గా ప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : ఇటీవల టీడీపీ ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన రామచంద్రయ్యను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం కడప నగరం రామచంద్రయ్య నివాసంలో ఆయన్ను కలిసి దుశ్శాలువాతో పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ పేరును కాపు, బలిజ, తెలగ కార్పొరేషన్‌గా మార్చేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రాంతాలు వేరైనా కాపులు, బలిజలు తెలగలు ఒకటేనని, ఐక్యమత్యంతో ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం చైర్మన్, డైరెక్టరు పదవులు కేటాయించి కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రయ్యను సన్మానిస్తున్న దుర్గాప్రసాద్

హెల్మెట్ ధరించకపోవడం చట్టరీత్యా నేరం

● సీనియర్ సివిల్ జడ్జి

కడప(రూరల్) జూలై 5 : ద్విచక్ర వాహనదారులు, పిలియన్ డ్రైవర్లు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. హెల్మెట్ ధరించడంపై తగు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురుషులు, మహిళల కేంద్రాగారాల సూపరింటెండెంట్లు, న్యాయవాదులు, పోలీసులు, పారాలీగల్ వాలంటీర్లు, ఎన్జీవోలు, వైద్యాధికారులు, వాహనదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

ఇన్‌స్టంట్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5:డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వైవీయూ అధికారులు అన్ని పరీక్షలకు ఇన్‌స్టంట్ అవకాశం కల్పించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ డిమాండ్ చేశారు. శుక్రవారం వైవీయూ పరిపాలన భవనం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 - 2024లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు వైవీయూ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. నాలుగో సెమిస్టరు వరకు ఒక్క పరీక్షకు మాత్రమే అవకాశం ఇవ్వడం వల్ల వందలాదిమంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని గుర్తు చేశారు. అన్ని పరీక్షలు రాసుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పవన్, యశ్వంత్‌రెడ్డి, ఆదిత్య, సుశాంత్, విశాల్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల నియంత్రణ అధికారికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి, యువజన సంఘం ప్రతినిధులు

ఫీల్డ్‌వర్క్‌లో మొబైల్ అప్లికేషన్స్‌ను తగ్గించాలి



సత్యకుమార్‌ను సత్కరిస్తున్న అహరోన్

కడప (మారుతీనగర్), జూలై 5:వైద్య, ఆరోగ్యశాఖలో ఫీల్డ్ వర్క్‌లో సేవలందిస్తున్న ఉద్యోగులకు మొబైల్ అప్లికేషన్స్‌లో కొన్నింటిని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబారపు అహరోన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు శుక్రవారం ఏపీ పీహెచ్ అండ్ ఎంఈయూ ఆధ్వర్యంలో ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను విజయవాడలోని ఆ యన చాంబరులో కలిసి సత్కరించారు. అనంతరం వినతిపత్రం అం దించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా వైద్యశాఖలోని ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ పద్ధతిని ఫీల్డ్ వర్క్‌లో తీసివేయాలన్నారు. సబ్‌సెంటరుకు బాడుగ లేదా అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. ఫీల్డ్‌కు వెళ్లే ప్రతి ఉద్యోగికి ఎఫ్‌టీఏ, టీఏ మంజూరు చేయాలని అన్నా రు. రిపోర్టులు, రికార్డులు తయారు చేసేందుకు ప్రతి ఉద్యోగికి కనీసం రూ.1000 మంజూరు చేయాలన్నారు. అలాగే యూనిఫాం, దోబీ అలవెన్స్, హెచ్‌ఆర్ఏ, కొన్ని జిల్లాలలో మంజూరు చేయడం లేదన్నారు. సచివాలయాల్లో ఏఎన్ఎంల పనివేళలను అలాగే పీహెచ్‌సీల్లో ఏఎన్ఎంల పనివేళలను మార్చాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగర్, గౌరవ సలహాదారు ఎస్వీ రమణ, ట్రెజరర్ బాబాసాహెబ్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి: ఆర్ఎస్‌యూ

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం ప్రకాశ్‌నగర్ బాయ్స్ హాస్టల్‌లో ఆర్ఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆర్ఎస్‌యూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 జూలై 5న ఆర్ఎస్‌యూ ఆవిర్భవించిందని, పది సంవత్సరాల నుంచి విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. భవిష్యత్తులో దేశ వ్యాప్త విధానంగా సమస్యల పరిష్కారానికి ఆర్ఎస్‌యూ నాయకత్వం వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు సందీప్, జశ్వంత్, హాస్టలు విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్ఎస్‌యూ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం ప్రతినిధులు

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ

వేముల, జూలై 5: ఆత్మ ఆధ్వర్యంలో పత్తి, చీనీ, వేరుశనగ, కంది, ఉల్లి పంటలను శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ పరిశీలించారు. శుక్రవారం మండలంలోని గొందిపల్లె గ్రామంలో ఆత్మ పీడీ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి, ఆత్మ డీపీడీ డాక్టర్ పద్మలతతో కలిసి పంటలను పరిశీలించి అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ పత్తి, వేరుశనగలో ఉండే తామరపురుగుల, లద్దెపురుగు, తెల్లదోమ, పచ్చదోమ, వంటి తెగుళ్ల సోకాయని రైతులతో అన్నారు. వీటి నివారణకు మందులు సూచించి ఎలా వాడలో తెలియజేశారు. పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు వాడాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రసాయన మం దులు తగ్గించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అలాగే చీనీ పంటలో బోరాన్ లోపంనివారణకు, నల్లి నివారణకు మం దులు సూచించారు. ఈ కార్యకరమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, పీడీ, డీపీడీ

'మార్కెట్ యార్డు సిబ్బందిని బెదిరించారని చెప్పడం అవాస్తవం'

పులివెందుల టౌన్, జూలై 5: మార్కెట్ యార్డు సిబ్బందిని బెదిరించారని చెప్పడం అవాస్తవమని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే మార్కెట్ యార్డులో పనిచేస్తున్న సిబ్బందిని ఎంపీ అవినాష్‌రెడ్డి తొలగించారన్నారు. సిబ్బందిని తొలగించకుండానే తొలగిస్తున్నట్లు ఎంపీ అవినాష్ రెడ్డి ఎందుకు ఉలిక్కిపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. 2001లో ఇదే సిబ్బంది దొంగ బిల్లులు ఇస్తూ, దొంగ రిజిస్టర్ మెయింటైన్ చేస్తున్నప్పుడు కూడా వారిని మందలించి సరిగా పనిచేయాలని నాలుగైదు సార్లు వారికి చెప్పామని గుర్తు చేశారు. అప్పుడు పనిచేస్తున్న కార్యదర్శి కూడా దీనికి సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మాటిమాటికి ఉలిక్కిపడుతున్నారన్నారు. సిం హాద్రిపురంలో పనిచేస్తున్న వారిని కూడా బెదిరించినట్లు చెప్పడం ఏ మిటన్నారు. అలా బెదిరించినట్లు ఆధారాలు ఉంటే చూపించాలన్నారు. మార్కెట్ యార్డు సెక్రటరీ రత్నరాజుపై పరువునష్టం దావా వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబురెడ్డి, రమేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, అనంతరెడ్డి, ఓబయ్య తదితర టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి

బహుముఖ ప్రజ్ఞాశాలి రామ్‌విలాస్ పాశ్వాన్

పులివెందుల రూరల్, జూలై 5: లోక్ జనశక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు రామ్ విలాస్ పాశ్వాన్ బహు ముఖ ప్రజ్ఞాశాలి అని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ మోదీన్, నియోజకవర్గ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డిలు కొనియాడారు. శుక్రవారం రామ్‌విలాస్ పాశ్వాన్ 77వ జయంతి సందర్భంగా స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో దివ్యాంగులకుక్యారియర్లు పంపిణీ చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. జాతీయ దళిత నేతగా, కేంద్రమంత్రిగా,అట్టడుగువర్గాల ఆశాజ్యోతిగా, బడుగుబలహీన వర్గాల గుండెచప్పుడుగా పేరొందిన వ్యక్తి రామ్‌విలాస్ పాశ్వాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు రఘునాథరెడ్డి, లోక్‌సశక్తి పార్టీ దళిత విభాగం నాయకులురవికుమార్, మైనార్టీ విభాగం నాయకులు అబ్దుల్లా, సునీల్ వేణు, ఖాదర్, బాష, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు క్యారియర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అకడమిక్ క్యాలెండరు పంపిణీ చేయండి: యూటీఎఫ్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండరును డీసీఈబీ ద్వారా ముద్రించి అన్ని పాఠశాలలకు పంపిణీ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులవుతున్నా డీసీఈబీ ద్వారా ముద్రించి పంపిణీ చేయాల్సిన లిఫ్ట్ ఆఫ్ హాలిడేస్ పాఠశాలలకు చేరలేదన్నారు. అకడమిక్ క్యాలెండరు సకాలంలో పాఠశాలలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ అనురాధ స్పందిసస్తూ ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్‌తో సంప్రదించి వీలైనంత త్వరగా ముద్రించి పంపిణీ చేస్తామన్నారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, యూటీఎఫ్ నాయకులు వెంకటరమణ, గంగాధర్‌బాబు పాల్గొన్నారు.



డీఈఓ అనురాధకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

పొలంబాట కార్యక్రమానికి హాజరుకావాలి

పెండ్లిమర్రి, జూలై 5: ఖరీఫ్‌లో ప్రతి రోజు ఉదయాన్నే సిబ్బంది పొలంబాట కార్యక్రమానికి హాజరుకావాలని మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు సూచించారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రం సిబ్బందికి ఏఓ శిక్షణనిచ్చారు. మట్టినమూనా, కౌలుదారుకార్డులు, పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ తప్పకుండా చేయాలన్నారు. మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏఓ ఓబులేసు

నిధుల మళ్లింపుపై చర్యలు తీసుకోవాలి

● కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శికి వినతి



కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న మునిరెడ్డి

కడప(రూరల్) జూలై 5:గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన ఆర్థిక సంఘాల నిధులను గత వైసీపీ ప్రభుత్వ పాలకులు దారి మళ్లింపుపై తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ద్వారా కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉపకార్యదర్శి విజయకుమార్‌ను కోరినట్లు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపి మునిరెడ్డి తెలిపారు. రూ.998.84 కోట్లను దారిమళ్లించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. గత మూడు సంవత్సరాలలో వేల కోట్ల కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు ఇవ్వకుండా తద్వారా ఎలాంటి మౌలిక సదుపాయలు కల్పించకుండా గ్రామీణ ప్రాంత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. కేంద్రం ద్వారా ఏపీకి మంజూరైన ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలు, స్థానిక సంస్థలకు జమచేసేలా చర్యలు తీసుకుంటామని విజయకుమార్ హామీ ఇచ్చారన్నారు.

'అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : కడప నగరంలోని క్రిష్ణ సర్కిల్‌లో ఉన్న యాకుబ్‌సాబ్ మసీదు శ్మశాన స్థలాన్ని కార్పొరేషన్ రోడ్డు విస్తరణలో భాగంగా జరిగిన ధర్నాలో కొందరిపై కేసు లు బనాయించారని, ఆ కేసులు ఎత్తివేయాలని అఖిలపక్ష నేతలు డి మాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఒత్తిడి మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారన్నారు.అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు సలావుద్దీన్, ఎస్ఏ సత్తార్, సీపీఐ నేత చంద్ర, అఖిలపక్ష కమిటీ కన్వీనరు ఆర్వీ ప్రసాద్, గురప్ప, ఇన్సాఫ్ కేసీ బాదుల్లా, టీడీపీ నాయకులు జిలానీబాషా, కాంగ్రెస్ నాసర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం

కడప (మారుతీనగర్) జూలై 5: యోగివేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకుడు, జమ్మలమడుగు శబరికాలనీ నివాసి వనం శ్రీనివాసులుకు ఆ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సహ ఆచార్యులు డాక్టర్ పి. ప్రమీల మార్గరెట్ పర్యవేక్షణలో ట్రైబల్ గర్ల్స్ ఎడ్యుకేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఏ స్టడీ విత్‌రెన్స్ టు కడప డిస్ట్రిక్ట్ అనే అంశంపై శ్రీనివాసులు చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికా రి ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన రాసిన పరిశోధన వ్యాసాలు పలు జాతీయ జర్నల్స్ ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ రావడం పట్ల అతని తల్లిదండ్రులు వనం నాగమ్మ, వనం భూషన్నతో పాటు పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



వనం శ్రీనివాసులు

'కడప నుంచి హైదరాబాదుకు ఫ్లైట్ ఏర్పాటు చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 :కడప నుంచి హైదరాబాదుకు డైరెక్టు ఫ్లైట్ ఏర్పాటు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కడప ఒకటన్నారు. కడప అనేక పరిశ్రమలు, విద్యాసంస్థలు, చారిత్రక మైలురాళ్లకు నిలయమన్నారు. కడప -హైదరబాదు మధ్య 400 కిమీ దూరం ఉందని, ప్రస్తుతం కడప - హైదారబాదు మధ్య ప్రయాణ మార్గాలు పరిమితంగా ఉన్నాయన్నారు. రోడ్డుమార్గంలో అయితే సుమారు 7గంటలు, రైల్లో అయితే 9 గంటలు ప్రయాణం పడుతుందన్నారు. హైదరాబాదుకు డైరెక్టు ఫ్లైట్ ప్రవేశపెట్టడం వల్ల వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడంతో పాటు కడప పరిసర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

రైతు బజారులో సమస్యలు పరిష్కరించాలి: ఆర్పీపీ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 5: కడప రైతు బజారులో సమస్యలు పరిష్కరించాలని ఆర్పీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశా రు. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురికి వాసన కొడుతోందన్నారు. ఆర్పీపీ బృందం శుక్రవారం ఉదయం రైతుబజారులో పర్యటించింది. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు బజారు అభివృద్ధి కోసం విడుదల చేసిన రూ.25 లక్షలు నిధులు దేనికి వినియోగించారో తెలపాలని డిమాండ్ చేశారు. దుర్వాసన వెదజల్లుతోందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే రైతు బజారులో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేడు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

సింహాద్రిపురం, జూలై 5: ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి శివప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సింహాద్రిపురం ఏరియా పశువైద్యశాల పరిధిలోని సింహాద్రిపురం, లింగాల, బిదినంచెర్ల, మురారిచింతల పశువైద్యశాలల్లో ఈనెల 6న రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆత్మబంధువులు.. మా వడ్డెరులు

● ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కడప (మారుతీనగర్) జూలై 5: 'ఆత్మబంధువులు.. మా వడ్డెరలు' అని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐఎంఏ హాలులో వడ్డెరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. గత ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. దీంతో వడ్డెరులకు కావలసినంత పనిదొరకడంతో వారి జీవితాలలో ఆనందపు కాంతులు తొణికిసలాడగలవన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఇసుక బంగారం కావడంతో సుమారు 60లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న చంద్రన్న ఇచ్చిన హామీని అమలుపరచేందుకు చొరవ తీసు కుంటామన్నారు. జమాల్‌పల్లె గుట్టల్లో రాళ్లు కొట్టుకుని వారే స్వయంగా అమ్ముకునేలా వడ్డెరులకు అవకాశం కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సం ఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి నారాయణ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, బత్తల జానకీరామ్, శ్రీనివాసులు, గంపా వీరయ్య, వంశీ, శ్రీనివాసులు, ఆర్.రామకృష్ణ, చంద్రబాబు యువసేన నాయకులు చల్లా మధుసూదన్ పాల్గొన్నారు. అనంతరం మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.



మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న వడ్డెరులు

పురపాలక పాఠశాలల జీఓ 84పై ప్రభుత్వం పునఃసమీక్షించాలి

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5: మున్సిపల్ విద్యావిధానంలో భాగంగా గత ప్రభుత్వం విద్యాశాఖ పరిధిలోకి మున్సిపల్ పాఠశాలలను తీసుకువస్తూ జీఓ 84 జారీ చేసి అమలుచేసిందని దీనిపై ప్రభుత్వం పునః సమీక్షించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంఘమేశ్వరరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ కన్వీనరు రవిశంకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎస్టీయూ భవనంలో జీఓ 84పై చర్చ వేదిక నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాశాఖలో మున్సిపల్ పాఠశాలలు తీసుకున్నప్పటికీ ఇంత వరకు ఏ కొత్త పోస్టు మంజూరు చేయలేదని, కడప మున్సిపాలిటీకి 30 పోస్టుల వరకు అదనంగా అవసరం అయినప్పటికీ ఒక్క పోస్టు కూడా మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఉపాధ్యాయులపై పనిభారం పెరిగిందన్నారు. కడప కార్పొరేషన్ ప్రత్యేక చొరవతో గత సంవత్సరం దాదాపు 98 విద్యావలంటీర్ల పోస్టుల రూపంలో అందించడం ద్వారా గత విద్యాసంవత్సరం ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా నడిచిందన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇంత వరకు బదిలీలు, పదోన్నతులు జరగలేదన్నారు. దీనిపై ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సంజీవరాయుడు, అస్లాం, పద్మాకర్, దామోదర్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా

చంద్రబాబును జగన్ విమర్శించడం దుర్మార్గం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిలుపై ఉన్న మాజీ సీఎం జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడం అత్యంత దుర్మార్గమని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి విమర్శించారు. శుక్రవారం కడప నగరంలోని తన కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి పిన్నెల్లిని పరామర్శించి మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇష్టానుసారంగా ఏకవచనంతో చంద్రబాబుపై మాట్లాడుతున్నారన్నారు. వైసీపీ ఐదేళ్లపాలనలో హత్యలు, దౌర్జన్యాలు ఎన్నో జరిగాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఏకవచనంతో సంబోధిస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా ఈవీఎం యంత్రాలను ధ్వంసం చేసిన వ్యక్తిని పరామర్శించడం అత్యంత హేయమైనదన్నారు. 2019లో ప్రజావేదిక కూల్చినప్పటి నుంచి నిన్నటి మాచర్లలో తెలుగుదేశం కార్యకర్తను చంపినంత వరకు వైసీపీ పాలనను ప్రజలంతా చూశారన్నారు. అందుకే ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో దాడులు, హత్యలు కూల్చివేతలపై ఒక పెద్ద గ్రంథమ తయారు చేయవచ్చన్నారు. 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పడిపోయినందుకు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన జగన్‌రెడ్డి పిన్నెల్లిని వెనకేసుకురావడం దుర్మార్గమన్నారు. ఐదేళ్లపాటు జరిగిన అరాచక పాలనలో ఎంత మంది ఐఏఎస్, ఐపీఎస్, ఆర్డీఓ, తహసీల్దార్లు జైలుకు వెళతారో వేచి చూడాల్సి ఉందన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకుందని, వచ్చే ఎన్నికల్లో పదికి పది స్థానాలు కూడా కైవసం చేసుకునేలా ప్రజలకు అనుకూలమైన పాలన అందిస్తామని స్పష్టం చేశారు. ఈస మావేశంలో టీడీపీ నాయకులు గురప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గోవర్ధనరెడ్డి

పిల్లలందరూ బడిలో ఉండాలి

● ఎంఈఓ గంగిరెడ్డి, ఎంఈఓ-2 షేక్ ఇర్షాద్ అహ్మద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : బడిఈడు పిల్లలు (6 నుంచి 14) సంవత్సరాల్లోపు పాఠశాల లోనే ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బడికి పోదాం కార్యక్రమాన్ని చేపట్టిందని కడప ఎంఈఓ గంగిరెడ్డి, షేక్ ఇర్షాద్ అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం కాగితాలపెంటలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల్లో ఉండి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు అలీఅక్బర్, రాజశేఖర్, రమాదేవి, జహీర్‌హుసేన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ గంగిరెడ్డి, ఎంఈఓ 2 ఇర్షాద్ అహ్మద్

నేడు రవాణా శాఖ మంత్రి రాయచోటికి రాక

రాయచోటిటౌన్, జూలై 5: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం రాయచోటికి రానున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు విజయవాడలో బయలుదేరి రోడ్డు మార్గంలో నెల్లూరు జిల్లా కావలి మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి చేరు కుంటారు. మార్గమధ్యంలో కావలి పట్టణంలో ఎమ్మెల్సీ వెంకటకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవనున్నారు.

అసౌకర్యాల నడుమ అంగన్వాడీ కేంద్రాలు

మరుగుదొడ్లు, ప్రహరీలు కరువు ● కొన్ని చోట్ల నీటిసదుపాయం లేక అవస్థలు

పెద్దముడియం, జూలై 5 : మండలంలో మౌలిక వసతులు కరువై అంగన్వాడీలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సరైన సౌకర్యాలు లేక అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడీ సిబ్బంది అందరూ మహిళలే ఉంటారు. వీరికి ప్రధానంగా మరుగుదొడ్ల అవసరం చాలా ఉంది. అయితే అవి చాలా చోట్ల లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తాగునీరు ఇతర అవసరాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అలాగే కేంద్రాలకు ప్రహరీలు లేక చిన్నపిల్లలతో అంగన్వాడీ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. చాలా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు ముళ్లపొదల మధ్యనే దర్శనమిస్తున్నాయి. ఇలాంటి సవాలక్ష సమస్యలతో పెద్దమడియం మండలంలో అంగన్వాడీ కేంద్రాలు అవస్థలు పడుతున్నాయి. మండలంలో మొత్తం 38 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో ఐదు అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక మిగిలిన వాటిలో పెద్దపసుపుల, హరిజనవాడ, పెద్దపసుపుల-1, పాలూరు, గరిశలూరు, నెమళ్లదిన్నె, బలపనగూడూరు తదతర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలకు ప్రహరీలులేవు. ముఖ్యంగా పెద్దపసుపుల హరిజనవాడ, గరిశలూరు,పాలూరు కేంద్రాలు ముళ్లపొదల మధ్య బిక్కుబిక్కుమంటూ చిన్నారులతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అలాగే చాలా వాటికి నీటి సదుపాయం లేక సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. మండలంలోని 8 కేంద్రాలకు నీటి సదుపాయం లేదు. అలాగే మరుగుదొడ్లు 9 కేంద్రాలకు లేవని అధికారులు తెలిపారు. ఇక విద్యుత్ సౌకర్యం పరిస్థితి కూడా సరేసరి. చాలా కేంద్రాలకు నామ మాత్రంగా విద్యుత్ సౌకర్యం కనిపిస్తున్నా అవి సక్రమంగా పనిచేయడంలేదు. పెద్దపసుపుల 1 సెంటరులో గత ప్రభుత్వ కాలంలో నాడు-నేడు కార్యక్రమంలో పనులు చేపట్టినా అవి అసంపూర్తిగానే ఉన్నాయి. కేంద్రానికి రంగులు వేయకుండా అరకొరగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. ఇలా అంగన్వాడీ కేంద్రాలు చాలా వరకు అసౌకర్యాల నడుమ నడుస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఆయా గ్రామాల్లో కేంద్రాల వద్ద మౌలిక వసతులు లేక సిబ్బంది పడుతున్నారు. ఎన్నిమార్లు తమ సమస్యలు ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారంలేదని అంగన్వాడీ సిబ్బంది, గ్రామీణ మహిళలు తెలుపుతున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సిబ్బంది, కేంద్రాలకు వచ్చే మహిళలు కోరుతున్నారు.



పెద్దపసుపుల ఎస్సీ కాలనీలో ప్రహరీలేక ముళ్లపొదల మధ్య అంగన్వాడీ కేంద్రం



పాలూరులో దెబ్బతిన్నమరుగుదొడ్డి,పెద్దపసుపులలో నాడు నేడు -2లో రంగులకు సైతం నోచుకోని అంగన్వాడీ కేంద్రం

ఆర్టీసీ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 5: ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న స్వీపర్ల వేతనాలకు కోత విధిస్తున్న విక్టర్ అసోసియేషన్ కాంట్రాక్టర్ వాసుదేవకుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆర్టీసీ డీఎం మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న స్వీపర్లకు రూ.11 వేలు వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.9 వేలు ఇచ్చి మిగిలిన రూ.2 వేలు కాంట్రాక్టర్ స్వాహా చేస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శులు విజయకుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, చంటి, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ఇస్తున్నవేతనాల్లో కోత విధిస్తున్న విక్టర్ అసోసియేషన్ ప్రొప్రయిటర్, కాంట్రాక్టరు వాసుదేవకుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్లలో పాత్రికేయులతో మాట్లాడుతూ స్వీపర్లకు 11,202 రూపాయల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 9100 ఇచ్చి రూ.3వేలు వెనక్కి తీసుకోవడం సమంజసం కాదన్నారు. ప్రొద్దుటూరు బస్సులు క్లీన్ చేస్తున్న కార్మికులకు కేవలం రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. వెంటనే కాంట్రాక్టు రద్దు చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంటా శ్రీనివాసులు, కె.పుల్లయ్య పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు, జూలై 5: జమ్మలమడుగు డివిజన్ కేంద్రంలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు యల్లయ్య తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు ఎన్జీవో హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు పాల్గొన్నారు.

14న సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్స్ ఎంపికలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 5: ఈనెల 14వ తేదీన ప్రొద్దుటూరులో సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అండర్-11, 13 సెలక్షన్స్ 14వ తేదీ కేఎస్ఎన్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తామని తెలిపారు. అండర్-16, 17 ఎంపికలు జార్జ్‌కారోనేషన్ క్లబ్‌లో జరుగుతాయన్నారు. సింగిల్స్, డబుల్స్ బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహించి జిల్లాజట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడా కారులు 12వ తేదీ సాయంత్రంలోపు 9440223908 నంబరుకు ఎంట్రీలను పంపుకోవాలని సూచించారు. క్రీడాకారులు తమ ఒరిజనల్ డేటాబర్త్, ఆధార్‌కార్డులను తీసుకురావాలని సూచించారు.

జడ్పీహైస్కూల్‌కు నూతన భవనం నిర్మించండి

కొండాపురం, జూలై 5 : మండల కేంద్రమైన కొండాపురంలో గండికోటప్రాజెక్టు క్రింద ముంపునకు గురైన జడ్పీహైస్కూల్‌కు నూతన భవనం వెంటనే నిర్మించాలని సీపీ ఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు కోరారు. శుక్రవారం జడ్పీ హైస్కూల్ ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గా కొండాపురం పట్టణంలో ముంపునకు గురైన జడ్పీ హైస్కూల్‌ను నిర్మించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల దగ్గర చుట్టూ కంపచెట్లు ఉండటంతో పాటు, బ్యాక్‌వాటర్ చుట్టూ చేరడం వల్ల విషపురుగులు వస్తున్నాయన్నారు.దీనివల్ల పాఠశాలలో 500 నుంచి 150కి విద్యార్థుల సంఖ్య పడిపోయిందన్నారు. కొత్త టీడీపీ ప్రభుత్వం ముంపు గురైన అన్ని ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే నిర్మించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారావు,అరుణ్ కార్తీక్,డేవిడ్,ఖాదర్‌బాషా,ప్రసాద్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ తెప్పించేందుకు కృషి

● ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



జిల్లా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం, జూలై 5 : ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి మెడికల్ కాలేజీ తెప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా అస్పత్రిలో అన్ని వార్డులను తిరిగి అక్కడి రోగులతో మాట్లాడారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి మెడికల్ కాలేజీ తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, వైద్యులు తదితరులు ఉన్నారు.

వసతి గృహ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించండి

జమ్మలమడుగు, జూలై 5: జమ్మలమడుగులో ప్రభుత్వ పాఠశాల, కళాశాల సంక్షేమ రెసిడెన్షియల్ గురుకుల వసతి గృహాల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ బాధ్యులు వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాల్లో బీసీ, ఎస్టీ, మధ్యతరగతుల విద్యార్థులకు అడ్మిషన్ కొరత లేకుండా చేయాలని కోరారు. కొన్ని చోట్ల ఆర్వో ప్లాంట్లు సరిగా పనిచేయడంలేదని, రిపేర్లు చేయించాలని తెలిపారు. వర్షాకాలంలో విద్యార్థులకు దోమతెరలు, జెట్‌కాయిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని తదితర ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పవన్, ఇర్ఫాన్, రాజు, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్ యాత్ర ర్యాలీ



పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద అధికారులు నిర్వహిస్తున్న ర్యాలీ

జమ్మలమడుగు, జూలై 5: జమ్మలమడుగు పట్టణంలో శుక్రవారం ఉదయం ఉద్యోగులు సంపూర్ణత అభియాన్ యాత్ర ర్యాలీ నిర్వహించారు. పీఆర్ స్కూల్ వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయం డివిజన్ సభాభవనానికి చేరుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో ముజఫర్ ప్రసంగించారు. నీతి ఆయోగ్ వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. జూలై 2024 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు సంపూర్ణత అభియాన్ యాత్ర కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులకు సమావేశపరచి అందుకు సంబంధించి సదస్సు నిర్వహించామన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల మధ్య మురుగునీరు, వర్షపునీరు నిలువ ఉండకుండా శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరిదేవి, ఏపీఎం గురుకుమార్ అంగన్వాడీ సూపర్‌వైజర్లు సైరాభాను, గౌషియా, వెంకటలక్ష్మి, హేమలత, శ్రీకాంత్, డాక్టర్లు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చారు



అంబేడ్కర్ సర్కిల్ వద్ద గుంతలు పూడ్చిన దృశ్యం

పోరుమామిళ్ల, జూలై 5 : ఎట్టకేలకు ఆర్అండ్‌బి అధికారులు గుంతలు పూడ్చి ప్రయాణికులకు, బాటసారులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక మరమ్మత్తులు చేశారు. పోరుమామిళ్లలో ఎప్పుడు వర్షం కురిసినా అంబేద్కర్ సర్కిల్, స్టేట్‌బ్యాంకు ఏరియా, ఆర్టీసీ బస్టాండు, సాయిబాబా దేవాలయం ప్రాంతాల్లో ఎక్కువగా వర్షంనీరు నిల్వ ఉండి నీటి గుంతలు తలపించేవి. ఈ విషయం పలుమార్లు పత్రికల్లో రావడం స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు శుక్రవారం ఆ గుంతల్లో కంకర, మట్టి వేసి గుంతలను పూడ్చడంతో ద్విచక్ర వాహనదారులకు, ఆటో నడుపుకునేవారికి ప్రజలకు కాస్త ఇబ్బంది లేకుండా చేశారు.

ప్రతి ఒక్కరూ బడిలో ఉండాలి

● ఎంఈఓ గంగిరెడ్డి, ఎంఈఓ-2 షేక్ ఇర్షాద్ అహ్మద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 5 : బడిఈడు పిల్లలు (6 నుంచి 14) సంవత్సరాల్లోపు పాఠ శాల లోనే ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బడికి పోదాం కార్యక్రమాన్ని చేపట్టిందని కడప ఎంఈఓ గంగిరెడ్డి, షేక్ ఇర్షాద్ అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం కాగితాలపెంటలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల్లో ఉండి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఆలీఅక్బర్, రాజశేఖర్, రమాదేవి, జహీర్‌హుసేన్ పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలపై కమిషనర్ దృష్టి

మైదుకూరు, జూలై 5: మున్సిపల్ పరిధిలోని 7,19వ వార్డుల్లో పల సమస్యలున్నాయని వాటిపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాను జనసేన పార్టీ కౌన్సిలర్ వాదనపల్లి బాబు, నాయకులు పి.క్రిష్ణమూర్తి, రామగోవిందు కలిసి కోరారు. శుక్రవారం కార్యాలయానికి చేరుకున్న వారు ఆ వార్డుల్లో పేరుకపోయిన సమస్యలపై వివరించారు. వాటిని త్వరిత గతిన పూర్తి చేయాలని, మున్సిపాలిటీని అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు.

'జగన్ క్రిమినల్‌ను వెనుకేసుకురావడం సిగ్గుచేటు'

చాపాడు, జూలై 5: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రిమినల్ అయిన పిల్లి రామక్రిష్ణారెడ్డిని వెనుకేసుకురావడం సిగ్గుచేటని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. రామక్రిష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో ఈవీఎం బాక్సులను ధ్వంసం చేయడం అక్కడ గ్రామాల్లో అరాచకాలు, దౌర్జన్యాలు చేసిన అతనిని సమర్థించడం సమంజసం కాదన్నారు. కొందమందిని హత్య చేసిన నేరస్థుడు రామక్రిష్ణారెడ్డి అని ఆయన విమర్శించారు.

విద్యార్థులపట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి

ఖాజీపేట, జూలై 5: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రతి విద్యార్థిని పలుకరించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయులు ప్రేమానురాగాలు చూపాలని అలాగే ప్రతి తల్లిదండ్రులు పేరెంట్స్ మీటింగ్‌కు స్కూల్‌కు రావాలన్నారు. స్కూలులో కలుషిత నీరు వస్తుంటే పిల్లలు చెప్పినా పట్టించుకోలేదంటే ఉపాధ్యాయుల పనితీరు ఇట్టే అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకుడు హరినాథరెడ్డి, నాగేష్, శ్రీను, రమణయ్య, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె గంగాధర్ పాల్గొన్నారు.

ప్రధాన నగరాలకు విమానాలు నడపండి

●మంత్రికి విన్నవించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్

మైదుకూరు, జూలై 5 : కడప విమానాశ్రయం నుంచి ప్రధాన నగరాలకు ప్రతి రోజూ విమాన సర్వీసులు నడపాలని స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ పౌర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును కోరారు. ఢిల్లీలో శుక్రవారం ఆయనతో పుట్టా మహేష్ మాట్లాడారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలల్లో కడప ఒకటని, తెలంగాణ రాజధాని హైదరాబాదుతో పాటు విజయవాడ, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై నగరాలకు నేరుగా విమానాలు ఉండేలా, హైదరాబాదునుంచి కడపకు డైరెక్టు విమానం కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు పుట్టా మహేష్ శుక్రవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 5: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం, అమావాస్య సందర్భంగా ఘనంగా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ప్రాతఃకాలం నుంచిస్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ మహాహోమంను నిర్వహించి వేద పండితులు పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం స్వామివారికి భస్మహారతి, భస్మార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రాబిస్ వ్యాధి సోకకుండా టీకాలు

పోరుమామిళ్ల, జూలై 5 : పెంపుడు కుక్కల ద్వారా రాబిస్ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా శనివారం టీకాలు వేస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం పోరుమామిళ్ల సబ్‌డివిజను పరిధిలోని అన్ని పశువైద్యశాలల్లో వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆయన తెలిపారు. పెంపుడు జంతువులు ఉన్న యజమానులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బద్వేలు, జూలై 5 : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ బద్వేలు పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బస్టాండు ఎదురుగా ఆటోస్టాండు కార్మికులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అక్కడి సమస్యలను కార్మికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గోపాల్, పెంచలయ్య, మునెయ్య, వెంకటసుబ్బయ్య, అర్జున్, ఓబులేసు, సుబ్బు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రాజేశ్వరీదేవి, కాశినాయన... చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 5: నూతన చట్టాలలో మహిళలు, చిన్నారులకు రక్షణ బాధ్యత కల్పించాలని చట్టాలపై అవగాహన కలగి ఉండాలని జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి రాజేశ్వరిదేవి సూచించారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యాక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, మండల మహిళా సమాఖ్య అధికారి గురుకుమార్, ఏపీవో పద్మారాణి, సూపర్‌వైజర్లు హేమలత, గౌషియా, సైరాభాను, వెంకటలక్ష్మి, సునీత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన..: కేంద్రప్రభుత్వం ఐపీసీ(ఇండియన్ పీనల్ కోడ్) బదులుగా అమలులోకి తెచ్చిన బీఎన్ఎస్ (భారత్ న్యాయ సంహిత)పై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దారు కృష్ణ,ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి,హెడ్‌కానిస్టేబుల్ ఖాదరయ్య,సీడీపీవో లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురంలోని వెలుగు కార్యాలయ సభాభవనంలో భారత్ న్యాయ సంహితపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ పర్యవేక్షకురాలు పలువురు అంగన్వాడీ కార్యకర్తలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 5: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వేంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒక మొక్క అమ్మకోసం

బి.కోడూరు, జూలై 5 : మోదీ పిలుపు మేరకు ఒక చెట్టు అమ్మకోసం నినాదంలో భాగంగా శుక్రవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పలూరు రామసుబ్బారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉట్టిశ్రీనివాసులు సగిలేరు గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని చదువుకునే విద్యార్థులు ఒక మొక్కను నాటి కన్న తల్లికి బహుమతిగా అందించాలని ఆ చెట్టు సంరక్షణ బాధ్యత అంతా మీరే చూసుకోవాలని ఆ చెట్టు పెరిగి పెద్దదైతే ఆ చెట్టులో మీ తల్లిని చూసుకోవచ్చని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైవే పనులను అడ్డుకోలేదు

● జగన్ పత్రికలో వచ్చిన కథనంపై కోర్టుకు పోతా : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, జూలై 5 : గ్రీన్ ఫీల్డ్ హైవే పనులపై పుట్టా రెడ్ సిగ్నల్ పేరుతో జగన్ పత్రికలో తనపై తప్పుడు కథనం ప్రచురితమైందని అది అవాస్తవమని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ హైవే పనులకు అడ్డగోలుగా మట్టి అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వానికి కోట్ల రూపాయలు గండి కొడుతున్నారని, వాటిని అడ్డుకోవడం నేరం కాదన్నారు. మట్టి తవ్వకాలు సక్రమం చేసుకొని మైదుకూరు అభివృద్ధికి సహకరించాలని, 15 కోట్లు తనకు ముట్టజెపితేనే పనులు చేయాల్సిందిగా తాను హుకుం జారీ చేసినట్లు వచ్చిన అంశంపై కోర్టుకు వెళ్తానన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో అల్లాడుపల్లె నుంచి వనిపెంట వరకు 19.4 కిలో మీటర్లు కొనసాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్నట్లు, 15 కోట్లు ముట్టజెపితేనే పనులు చేయాల్సిందిగా హుకుం జారీ చేసినట్లు అబద్దపు వార్తలు రాశారన్నారు. అధికారుల అనుమతులు లేకుండా కాంట్రాక్టరు రాయల్టీ కట్టకుండా, కొండలను పిండి చేస్తూ మట్టిని అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. అలాగే సంబంధిత ప్రాంతంలో అధికారులు సూచించిన ప్రదేశంలోనే తవ్వకాలు జరగాలని, అక్రమ తవ్వకాలు చేస్తున్న ప్రాంతాలను జీపీఎస్ తో కూడిన ఫొటో ఆధారాలతో మీడియాకు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న పనులకు కాంట్రాక్టర్లు అందరూ సక్రమం గా రాయల్టీ కడితే దాదాపు 110 కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. కొండలు, వాగులు, వంకలు, చెరువుల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలకు జే టాక్స్ చెల్లించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. దానిని ఆపుతుంటే అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రచురించడం సరికాదని, జగన్ పత్రికలో వచ్చిన కథనంపై కోర్టులో కేసు వేస్తానని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన పేర్కొన్నారు.





మట్టి అక్రమ తవ్వకాలు